# నాకు నచ్చిన నా కథ



వీరభద్రరావ్ పమ్మి

ఏ కథైనా రాస్తున్నప్పుడే- నాకు చాలా మంచి కథలా అనిపిస్తుంది. రాసిన కథలన్నిటినీ పరిశీలించి చూస్తే అందులో కొన్ని ఓ మాదిరిగా ఉంటాయి. కొన్ని బాగుంటాయి. కొన్ని ఇంకా బాగుంటాయి. అలా వడబోయగా నాకు ఎంతో బాగా నచ్చిన కథ.... మరో ఆకలి కథ. అన్నింటి కన్నా ఇది ఎక్కువ నచ్చడానికి కొన్ని కారణాలున్నాయి-

ఆకలి, అన్యాయం, మోసం, ప్రేమ, త్యాగం.... ఇలా ఏ విషయం తీసుకున్నా-ప్రతి భాషలోను (తెలుగుతో సహా ఎన్నోకథలు వచ్చాయి. రాయని సబ్జెక్టే కనిపించదు. కాకపోతే- అవే సబ్జెక్టులు- ఏదో కొత్త విషయాన్ని వెలికిపట్టి, ఆ సంఘటనని, లేదా ఆ పాత్రని.... తనదైన దృష్టిలో చూసి నలుగురికి చెప్పడానికి ప్రయత్నిస్తాడు రచయిత. ఆకలి మీద వేల కథలు వచ్చాయి. అదే ఆకలి మీద కొత్త రకమైన కథ చెప్పానన్న తృప్తి- ఈ కథ రాయడం వల్ల నాకు కలిగింది.

ఇది నేను రాసిన రెండో కథే అయినప్పటికీ, ఇది ఆంధ్రప్రభ వార

పత్రికలో ['75 ఉగాది ప్రత్యేక సంచిక] ప్రచురింపబడినప్పుడు కథా రచయితగా నాకు మంచి గుర్తింపు వచ్చింది

అందువల్ల కూడా ఇది నాకు ఎక్కువగా నచ్చిందనిపిస్తుంది.

ఇది మీకూ నచ్చుతుందని నా ఆశ . ఇహ చదవండి.

# మరో ఆకలి కథ

ఆఫీస్ ఫంక్షన్ జరగడానికి కింక పదిరోజు లుంది.

నాటకం రిహార్సెల్ నా ఊపిరి పీల్చేస్తూంది.

ఛీ! ఇంకెప్పుడూ ఈ వెధవలతో నాటకా లెయ్యకూడదు. అయినా, ఇలా ఇదివర కెన్నిసా ర్లనుకోలేదు?

ఈరోజు రిహార్సెల్‌లో నాకు చిరాకు, కోపం, నీరసం, ఉడుకుమోత్తనం, ఏడుపు- అన్నీ కలగాపులగంగా వచ్చాయి.

రావుగాడు మరీ వెధవ.

ఎప్పుడూ టైముకి రాడు.

ఎప్పటికీ పోర్షన్ రాదు.

ఎన్నడూ చెప్పిన మాట వినడు.

తీరా స్టేజి ఎక్కేసరికి దడా వణుకూ.

వాడో పెద్ద నటుణ్ణనుకుంటాడు.

ఇదంతా నా ఖర్మ.

మా ఆఫీసులో అంతకన్నా నాటకా లేసే మనుషులే లేరు. వాడిమీద ఎప్పుడేనా ఏ. కుపడితే "నువ్వొక్కడివే చేసుకో!" అంటాడు.

వాడితో ఈ రోజు పెద్ద యుద్ధమైపోయింది.

అసలు దీ తంతా కారణం సుమిత్ర.

దానికసలు బుద్ధిలేదు.

పోనీ, గోలెక్కుతూందని దీపావళికి పుట్టింటికి పంపిస్తే పండుగైపోగానే వచ్చెయ్యొద్దూ?

"మా అమ్మకి నీరసంగా ఉంటూంది. పెద్దొదిన నీళ్ళోసుకుని పుట్టింటి కెళ్ళింది. చెల్లాయికి కాలేజీ చదువు. చిన్నోదిన మామూలుగానే సంవత్సరంలో సగభాగం పైగా పుట్టింట్లోనే ఉంటుంది కదా? కాబట్టి నాన్నగారి బలవంతం

మూలాన మరో నెల్లాళ్ళు ఇక్కడుంటున్నాను. ప్రియమైన శ్రీవారూ! అనుమ తిస్తారు కదూ ?" అంటూ వ్రాసింది.

మధ్యాహ్నం ఆఫీసులో ఆ ఉత్తరం అందుకున్నప్పట్నుంచి నా కసలు మూడ్స్ బాగా లేవు.

సుమిత్ర మీద జన్మలో ఎప్పుడూ రానంత కోపం వచ్చేసింది. (అఫ్ కోర్స్! మా పెళ్ళయి ఇంకా సంవత్సరం కాలేదు.)

స్టుపిడ్! ఇంకెప్పుడూ ఛస్తే పుట్టింటికి పంపను.

వారం రోజులుగా వస్తుందని ఎదురుచూస్తున్నాను.

రోజూ పాలు ఎక్స్ట్రా పోయించుకుని ఉదయం ఎనిమిది గంటలదాకా వచ్చి పోయే ప్రతి ఆటోని శ్రద్ధగా పరికిస్తున్నాను.

ఒక్కటీ మా ఇంటిముం దాగదు.

సుమిత్ర దిగదు.

రాత్రిళ్ళు నాకు నిద్రపట్టదు,

అయినా, వాళ్ళ పెద్దవాళ్ళకేనా బుద్ధుండొద్దూ ?

మా పెళ్ళయ్యాక సగం రోజులు అక్కడే ఉంది.

పోనీ, ఒకసారి పోయిపద్దామంటే ఈ నాటకం ఒకటి నా ప్రాణానికి!

ఏ జంట నక్కగా వెడుతున్నా వెంటనే సుమిత్ర గుర్తుకొచ్చేస్తూంది.

అయినా, పెళ్ళికాకముందు ఎన్ని సంవత్సరాలు ఒక్కణ్ణీ ఉండలేదు? ఎప్పుడేనా అమ్మమీద కాని, ఇంటిమీద కాని బెంగెట్టానా ?

మరి ఇప్పుడు ?

ఏమిటీ మార్పు ?

శ్రీదేవి వదిన పుట్టింటి కెడితే వారం తిరక్కుండానే అన్నయ్య గుంటూరు బస్సు ఎందుకు ఎక్కేసేవాడో ఇప్పు డర్థమౌతుంది.

కార్తీ మాసం మూలంగా చలి కుదిపేస్తూంది.

దారుణమైన ఒక్కని చలి.

నాకైతే రీ ఘోరంగానూ, భయంకరంగానూ అనిపిస్తూంది.

సుమిత్ర లేనిదే ఒక్కణ్ణీ ఈ చలిని భరించలేననిపిస్తూంది.

రిహార్సల్ నుంచి బయటికొచ్చిన భాస్కరం అడిగాడు!

"ఏమిటి, ఈ వేళ నీ మూడ్ బాగాలేదు ?"

"ప్రత్యేకంగా కారణ మేమి లేదు."

"అన్నట్టు మీ మిసెస్ నుంచి లెటరొచ్చిందా ?"

"మరో నెల్లాళ్ళ అక్కడే వుంటుందట."

"ఐ సీ ! మూన్‌లాండ్‌కి పోదాం- రారాదూ ? మంచి కేబరే ఉంది. ప్రీతి ప్రమ్ బాంబే చేస్తూంది."

సుమిత్ర మీద కసి తీర్చుకోవాలనిపించింది.

"నడు" అన్నాను.

కేబరే బాగుంది.

బాగా ఎంజాయ్ చేశాం. ఇద్దరం చెరో క్వార్టరూ విస్కీ బిగించాం. అక్కడున్న కాసేపు హాయిగా ఫీలయ్యాను.

నన్నింటి దగ్గర తన స్కూటర్ మీద డ్రాప్‌చేస్తానన్నాడు భాస్కరం. వద్దన్నాను.

రవీంద్రభారతి దగ్గర వదిలేసి తను నారాయణగూడా వెళ్ళిపోయాడు.

బార్‌లోంచి బయటపడ్డాక చలి మరీ ఎక్కువయింది.

డాన్స్ చూసినప్పటినుంచి మనస్సులో చలి మొదలయింది.

అసెంబ్లీ కెదురుగా జాంజాం కేఫ్ దగ్గర నిలబడ్డాను. రిక్షాలు, ఆటోలు ఏమీ లేవక్కడ.

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది.

నేనక్కడ నిలబడ్డాక కొన్ని క్షణాలకు గాని చూడలేదు.

చీకట్లో కళ్ళు పెద్దవిచేసుకుని చూశాను.

ఒక యువతి గోడపక్కగా నిలబడింది.

ముదురు రంగు చీరలో కొంగు నెత్తిమీదుగా కప్పుకుని గోడకు జేర్లబడి నిలుచుంది.

దగ్గరగా చూస్తే ఆమె బాగా ఉందనిపించిది.

టైమ్ చూశాను. పన్నెండూ పది.

ఇప్పుడామె అక్కడెందుకు నిలబడినట్లు ?

బస్సులు వచ్చే టైమ్ దాటిపోయిందే ?

కొంచెం అర్థమైంది నాకు.

కొన్ని క్షణాలాగి ఆమెకు దగ్గరగా వెళ్ళాను.

"మీ రెక్కడికి వెళ్ళాలి ?" నేనే అడిగాను.

"కోఠీ."

"మీరొచ్చాక బస్సేది రాలేదా?"

ఆ సమయంలో బస్సు రాదని తెలిసీ అడిగాను.

"లేదు."

ఇంకొంచెం అర్థమైంది.

"మీ రెక్కడికి వెళ్ళాలి?" ఆమె అడిగింది.

"సుల్తాన్ బజార్."

నే నింకేమీ మాట్లాడలేదు.

ఖాళీ ఆటో వెడుతూంది. నేను పిలవకుండా తనే స్లో చేశాడు. అప్పుడు పిలిచాను.

ఆటో వచ్చి నా ముందాగింది.

మళ్ళీ ఆమె దగ్గరి కెళ్ళాను.

"వస్తారా?"

"ఎక్కడికి?"

"మా ఇంటికి."

"మీ ఇంటికా?" భయంగా అంది.

"ఫరవాలేదు. ప్రస్తుతం మా ఇంట్లో ఇంకెవరూ లేరు."

ఆమె ఏమీ మాట్లాడలేదు.

ఆమె ఇంకేమీ ఆలోచించలేదు.

ఆటోలో నా పక్కన కూర్చుంది.

నిర్జనంగా ఉన్న రోడ్డుమీద ఆటో స్పీడుగా పోతూంది. చలిగాలి రయ్ మని వీస్తూంది.

నేను వేసుకున్న స్వెట్టర్ చలి నాపలేకపోతూంది.

తాగిన మందు శరీరాన్ని వేడెక్కించలేకపోతూంది.

ఆమె భుజంమీద చెయ్యి వేశాను.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"నీ పేరేమిటి?" నే నామెను స్వంతంచేసుకున్నట్టు ఫీలవుతూ ఏకవచనంతో అడిగాను.

"సత్యవతి."

"ఇంతరాత్రి అక్కడ నిలబడ్డావేం?"

"పబ్లిక్‌గార్డెన్ నుంచి వస్తున్నాను."

అక్కడి కెందు కెళ్ళావని నే నడగలేదు.

ఆమే మళ్ళీ చెప్పింది.

"ఓ స్టూడెంటు రమ్మన్నాడు. వెళ్ళాను. అయిదురూపాయలు చేతిలోపెట్టి ముగ్గురు వెధవలు పంచుకోబోయారు. ఇంతలో వాచ్‌మన్ వచ్చాడు. వాళ్ళు కోతి పారిపోయారు. నేను దొరికిపోయాను. లక్ష ప్రశ్నలు వేసి పోలీసుల కప్ప చెప్పతానని బెదిరించి అయిదూ లాక్కున్నాడు."

ఆమెను దగ్గరగా తీసుకున్నాను.

చలికి ఒదిగిపోయి కూర్చుంది.

బుగ్గమీద ముద్దెట్టుకున్నాను.

"తాగారా?" అని అడిగింది.

"ఊఁ!" అన్నాను.

"రోజూ తాగుతారా?"

"లేదు- ఎప్పుడైనా."

పెదాలు అందుకోబోయాను.

"ఇంటి కెడుతున్నాంగా- ఇంకా రెందుకు?" అంది.

ఆమెను వదిలేసి దూరంగా జరిగాను.

ఇంటి కెళ్ళాక లైటు వెలుతురులోగాని చూడలేదు- ఆమె ముఖం పీక్కుపోయింది. కళ్ళు లోతుకుపోయాయి. జుట్టంతా చెదిరిపోయింది. చీర మాసిపోయి అక్కడక్కడ చిరిగింది. భుజంమీద పిగిలిపోయిన జాకెట్టు చీర కొంగుతో కప్పుకుంది.

ఏమైనా సత్యవతి అందంగానే ఉంది.

పోషణలేని గొప్పింటి బిడ్డలా ఉంది.

"స్నానం చెయ్యాలి.... నీళ్ళున్నాయా?" అని అడిగింది.

బాత్‌రూమ్‌లో చన్నీళ్ళున్నా యన్నాను.

ఫరావాలేదంది.

సుమిత్రవి చీర, జాకెట్టు తీసి ఇచ్చాను.

అనుమానంగా చూసిం దామె.

"ఫరవాలేదు. తీసుకో" అన్నాను.

ఆమె బాత్‌రూమ్‌లో కెళ్ళాక వీధితలుపు తాళంపెట్టి దిల్‌షాద్ టాకీస్ దగ్గరి కెళ్ళి కిళ్ళీలు తీసుకుని పువ్వులు, సిగరెట్లు కొనుక్కున్నాను.

తిరిగి వచ్చేసరికి సత్యవతి తల దువ్వుకుంటూంది. తెల్లచీరలో పువ్వు లెట్టుకుని అభిసారికలా తయారయింది.

ఎదురుగా కుర్చీలో కూర్చుని, "మీ దే ఊరు ?" అనడిగాను.

"అవన్నీ తరువాత చెబుతాను కానీ- తినడాని కేమైనా ఉందా ?" అని అడిగింది.

ఆ అడగడంలో సిగ్గు, అభిమానం, మొహమాటం, ఆకలి కలిసి మడత లుగా బయటికొచ్చాయనిపించింది నాకు.

"నువ్వు భోజనం చెయ్యలేదా ?" అనడిగాను.

"అన్నం తిని మూడు రోజులయ్యింది." నేలకేసి చూస్తూ అంది.

"మరిందాకటి నుంచీ చెప్పలేదేం ?"

"అయితే, ఏమీ లేదా ?" నిరాశగా, ఆత్రంగా అంది.

"పొద్దున వండిన అన్నం ఉంది- తింటావా ?" అనడిగాను.

"నిన్నటిదైనా ఫరవాలేదు."

ఆమె ముఖం చూస్తే చాలా బాధగా అనిపించింది నాకు.

ఆ కళ్ళలో ఆకలి సుళ్ళు తిరిగింది.

వంటింట్లోకి వెళ్ళి కుకర్ తీసి చూశాను.

అన్నం చాలా ఉంది. [illegible] పూటకి కూడా ప్రొద్దున్నే వండుకున్నాను. కొంచెం కూర కూడా ఉంది.

అన్నం, పచ్చడి, మజ్జిగ, కూర డైనింగ్ టేబుల్ మీద పెట్టాను.

కృతజ్ఞతాపూర్వకంగా కళ్ళలోకి చూసిందామె.

ఆమె కెదురుగా కుర్చీలో కూర్చున్నాను.

తాను వడ్డించుకుంటూ అంది:

"మీరు తినరా ?"

"వద్దు- బార్ లో పకోటా ఆమ్లెట్ తిన్నాను. ఆకలి లేదు."

"నాకు మాత్రం చాలా ఆకలిగా ఉంది సుమా !" తన కోర్కెను తాను సమర్థించుకునే ప్రయత్నంలా కనుపించింది.

కంచంలో పదార్థాలన్నింటినీ ఇరవై లంఖణాలవాడు భోజనానికి కూర్చునేముందు చూసినట్లు చూసింది.

బద్దలైన అగ్నిపర్వతంలాగ, రగులుతున్న విప్లవంలాగ ఉంది ఆమెఆకలి.

మళ్ళీ నెలదాక భోజనం దొరకదన్నట్లు ఆమె తినడం ప్రారంభించింది.

నేను కళ్ళార్పకుండా చూస్తూ కూర్చున్నాను.

మధ్య మధ్య ఆమె కూడా నాకేసి చూస్తూంది.

ఆ చూపులో యుగయుగాలుగా మనుష్యులందరూ ఉమ్మడిగా అనుభవించిన దైన్యం కనిపిస్తూంది. ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి. అవి ప్రపంచంలో బాధితులు, పీడితులు అంతా కలసి కార్చిన కన్నీటిచుక్కల్లా కనుపించాయి.

మూడు రోజుల క్రితం కాదు, మూడు సంవత్సరాల నాడు ఆమె భోజనం చేసి ఉంటుందన్న అనుమానం వచ్చింది.

ఆమె . ఆశగా ఆబగా అసహ్యంగా అన్నం తింటూంది.

ఆకలి తీర్చుకుంటూంది.

ఆమెలో అంత ఆకలివి చూశాక నాలో ఆకలి పూర్తిగా చచ్చిపోయింది.

వెంటనే లేచి డ్రాయింగ్‌రూమ్‌లో కొచ్చేశాను.

సోఫాలో కూర్చుండిపోయాను.

ఆమె వంటిల్లంతా సర్దేసి, తలుపేసి, చేతులు కొంగుతో తుడుచుకుంటూ వచ్చి సోఫాలో నా పక్కన కూర్చుంది.

"హమ్మయ్య హాయిగా అన్నం తిన్నాను. రాత్రంతా ఇక మీదాన్నే" అంది దగ్గరగా జరుగుతూ.

చటుక్కున లేచి నిలబడ్డాను.

జేబులో ఉన్న పాతిక రూపాయలు ఆమె కందిస్తూ, "నువ్వీ సోఫాలో పడుకో. ఈ డబ్బు నీ దగ్గర ఉంచుకో. తెల్లారి నేను లేచేసరికి ఇక్కణ్ణుంచి వెళ్ళిపో. దయఉంచి మళ్ళీ నా కంటబడకు" అని ఆవేశంగా అన్నాను.

ఊహించని ఈ పరిణామానికి ఆమె ఆశ్చర్యపోయింది. తెల్లబోయింది.

ఆమె మాట్లాడబోయింది.

నేనామెకా అవకాశం ఇవ్వకుండా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాను.

తలుపేసుకున్నాను.

మంచంమీద పడుకున్నాను.

మనస్సు తేలికపడినట్లనిపించింది.

మానవునికి ప్రాకృతికమైన కోరిక ఒక్కటే- ఆకలి.

అది ఘోరమైనది, భయంకరమైనది, బాధాకరమైనది.

మిగతా కోర్కెలన్నీ మానసికమైనవి.

అంతకన్న ఎక్కువ ఆలోచించలేకపోయాను.

నాకు చలి తగ్గినట్టనిపించింది.

వెంటనే నిద్ర పట్టేసింది. □